

జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ పుంగనూరులో అరాచకమే రాజ్యమేలింది. రాష్ట్రంలో అధికారం మారినాక అయినా పరిస్థితులు చల్లబడతాయని ప్రజలు ఆశపడ్డారు. తమకు న్యాయం జరుగుతుందని వైసీపీ బాధితులైన టీడీపీ కార్యకర్తలు నమ్మారు. కానీ ఏం మారలేదని శనివారం పట్టపగలు జరిగిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య సంఘటన నిరూపిస్తోంది.టీడీపీకి నమ్మకమైన కార్యకర్తను వైసీపీ నాయకుడు నరికి చంపిన తీరు అందరినీ భయపెడుతోంది. పోలీసులు, ఇతర శాఖల అధికారులూ కూడా ఇప్పటికీ పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తున్నారనే ఆరోపణలకు ఈ సంఘటన బలం చేకూరుస్తోంది. వైసీపీ నుంచి తనకు ప్రాణహాని ఉందని పదేపదే వేడుకున్నా రామకృష్ణ ప్రాణాలను కాపాడలేకపోయారు. వెంకట్రమణ అనే వైసీపీ కార్యకర్త చేతిలో దారుణంగా టీడీపీ కార్యకర్త హత్యకు గురయ్యాడు. ఈ పరిణామంతో జిల్లాలో వైసీపీ గత అరాచకాల గురించీ.. కొత్త ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న నిర్లక్ష్యం గురించీ చర్చ జరుగుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఆగని వైసీపీ అరాచకాలు



కృష్ణాపురంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, మృతుడి కోడలు భార్గవి ఆగ్రహం

- ప్రభుత్వం మారినా పుంగనూరులో టీడీపీ నేతలే బాధితులు
- వైసీపీ హయాం నాటి పోలీసులకు స్థానచలనాలేవీ?
- ఎస్పీ మణికంఠ తీరుపై టీడీపీ ఎమ్మెల్యేల అసహనం

వెయ్యిమందిపై అక్రమ కేసులు, రౌడీషీట్లు..

2023 ఆగస్టులో అంగళ్ల వద్ద చంద్రబాబును అడ్డుకున్న ఘటనలో ఏకంగా వందలమందిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించారు. భార్యా పిల్లల్ని వదిలేసి జైళ్లలో మగ్గారు. కేసుల భయంతో చాలామంది ఊర్లొదిలి వెళ్లిపోయారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై అధినేత రామచంద్ర యాదవ్ పర్యటనలను అడ్డుకోవడం, దాడులు చేయడం అప్పట్లో పరిపాటిగా మారింది. ఇలా పుంగనూరులో గత ఐదేళ్ల పాటు సుమారు వెయ్యిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యాయత్నం కేసులు పెట్టడంతో పాటు రౌడీషీట్లను నమోదు చేశారు.

సీఎం చెప్పినా..

చంద్రబాబు సీఎం అయ్యాక జనవరి 7న రెండోసారి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం పర్యటించారు. పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల మీద హత్యాయత్నం కేసులు నమోదు చేశారని, రౌడీషీట్లను తెరిచారని.. అవన్నీ అక్రమమేనని.. వాటన్నింటినీ ఎత్తేయాలని ద్రావిడ వర్శిటీలోని ఆడిటోరియంలో ఎస్పీ మణికంఠకు చెప్పారు.అయినప్పటికీ ఇంతవరకు ఆయా కేసుల గురించి సమీక్షించలేదు. ఎత్తేయలేదు.

పోలీసులు అదే స్థానాల్లో..

సాధారణంగా ప్రభుత్వాలు మారిన తర్వాత అధికారుల బదిలీలు కూడా జరుగుతాయి. అవసరాన్ని బట్టి ఆయా జిల్లాల్లో కూడా క్షేత్రస్థాయి అధికారుల బదిలీలు కూడా జరుగుతుంటాయి. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అండతో జిల్లాలో అరాచకాలు చేసిన పోలీసులు ఇంకా అదే స్థానాల్లో కొనసాగుతుండడం ఆశ్చర్యకరం. వారికి స్థానిక వైసీపీ నాయకులతో సఖ్యత ఉంది. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తన నియోజకవర్గంలో ఎస్‌ఐ, కానిస్టేబుళ్లను మండలాలు మార్చాలని, వైసీపీ హయాం నుంచీ అక్కడే ఉండడంతో ఇబ్బందిగా ఉందని ఎస్పీ మణికంఠకు నాలుగు నెలల కిందట విన్నవించినా స్పందన లేదు. ఈ విషయాన్ని ఆయన శనివారం మదనపల్లెలో ప్రస్తావించి ఎస్పీపై అసహనాన్ని వ్యక్తం చేశారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

సదుం మండలం పాలమంద గ్రామంలో ఎస్సీ ఎస్టీల భూముల్ని అక్కడి వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారు. ఈ విషయాన్ని బాధితులంతా తమ వద్దనున్న పట్టాదారు పుస్తకం వంటి అన్నిరకాల డాక్యుమెంట్లతో స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. స్పందన లేకపోవడంతో చిత్తూరుకు వచ్చి ఎస్పీకి, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకూ వారికి న్యాయం జరగలేదు. కూటమి ప్రభుత్వంలో కూడా పెద్దిరెడ్డికే అనుకూలంగా అధికారులు పనిచేస్తున్నారంటూ ఫిబ్రవరి 10వ తేదీన సదుం మండల వాసులు పెద్దఎత్తున మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. భూములు కబ్జా చేశారని కొందరు, అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారని మరికొందరు ఫిర్యాదు చేశారు.

ఎస్పీ తీరువల్లే ప్రాణాలు పోయే పరిస్థితి



జిల్లాలో ఎస్పీ తీరు సరిగా లేకే మా నాయకుల్ని బెదిరించే స్థాయి నుంచి ప్రాణాలు తీసే పరిస్థితి వచ్చింది. సీఐని కాదు.. ఉన్నతాధికారుల్ని సస్పెండ్ చేయాలి. మా పలమనేరు నియోజకవర్గంలో కూడా ఇంకా వైసీపీతో అంటకాగిన పోలీసులు పనిచేస్తున్నారు. పక్క పక్క మండలాలకు బదిలీ చేయమని ఎస్పీకి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో ఎస్పీకి ఫోన్ చేయడమే మానేశాను. మా నాయకుల్ని, కార్యకర్తల్ని చంపేస్తుంటే చూస్తూ ఇంట్లో కూర్చోమని మా సీఎం చెప్పలేదు కదా.?

- మదనపల్లె ఆస్పత్రి వద్ద అమరనాథ రెడ్డి

వైసీపీ అధికారంలో ఉన్నప్పటి అరాచకాల్లో కొన్ని..

- అప్పటి సీఎం జగన్ నియోజకవర్గమైన పులివెందులలో కూడా సజావుగా సాగిన శ్రీకాకుళంవాసుల సైకిల్‌యాత్ర పుంగనూరులో సాగలేదు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు యాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తల్ని పుంగనూరులో బట్టలూడదీసి ఘోరంగా అవమానించారు.
- పుంగనూరులో టీడీపీ కార్యాలయానికి అద్దెకిచ్చిన భవన యజమానిని వైసీపీ నాయకులు బెదిరించి, మున్సిపల్ అధికారులతో నోటీసులిప్పించి నిబంధనల పేరుతో భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తామన్నారు. దీంతో యజమాని కార్యాలయంలోని సామాన్లను బయట పెట్టించేశారు.
- సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం చేపట్టాలని చల్లా రామచంద్రారెడ్డి టీడీపీ శ్రేణులతో వస్తుండగా.. వైసీపీ శ్రేణులు అడ్డుకుని ఆయన కారుతో పాటు మరికొన్ని వాహనాలను ధ్వంసం చేశారు.
- రొంపిచెర్లలో చల్లా బాబు జన్మదినం సందర్భంగా టీడీపీ శ్రేణులు వేసిన ఫ్లెక్సీలను వైసీపీ మూకలు చించేశాయి. ప్రశ్నించినందుకు వైసీపీ వర్గీయులంతా రాళ్లు, సీసాలు, కర్రలతో దాడులకు దిగారు.
- చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డిపై పలుమార్లు వైసీపీ నాయకులు దాడులు చేశారు. బోయకొండ వద్ద వైసీపీ వారే దాడి చేయగా రమేశ్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపారు.
- పెద్దిరెడ్డికి కంటిలో నలుసుగా తయారయ్యారని పుంగనూరులో రామచంద్రయాదవ్ ఇంటిని, ఆరు వాహనాలను, ఆస్తులను 300మంది వైసీపీ మూకలు ధ్వంసం చేశాయి.
- మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెకు రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారానికి వచ్చారని వైసీపీ మూకలు రాళ్లు, కర్రలతో 17 వాహనాలు ధ్వంసం చేసి, ఐదు వాహనాలు దగ్ధం చేసి 20 మందిని గాయపరిచాయి. రామచంద్రయాదవ్ పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే వైసీపీ శ్రేణులు హతమార్చేందుకు చొచ్చుకుని రావడంతో పాటు ప్రచార రథాన్ని పోలీసుల ముందే కాల్చేశారు.
- 2020 మార్చిలో స్థానిక సంస్థల ఎన్నికలు పుంగనూరు చరిత్రలో నిలిచిపోతాయి.నియోజకవర్గంలో ఎక్కడా మంత్రి వైసీపీకి వ్యతిరేకంగా ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా వైసీపీ మూకలు ఎన్నికల అధికారి కార్యాలయాల్లోనే ఉంటూ అడ్డుకోవడం జరిగింది. వైసీపీ వారినే నామినేషన్ల దాఖలుకు పోలీసులు అనుమతించారు. టీడీపీ నేతలు ఆందోళనకు దిగి ధర్నాలు చేశారు. మొత్తంగా నియోజకవర్గంలోని అన్ని సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సహా మున్సిపల్ కౌన్సిలర్లను సైతం ఏకగ్రీవం చేసుకున్నారు.

ప్రాణహాని ఉందని పోలీసులను వేడుకున్నా...

- వైరల్ అయిన రామకృష్ణ వీడియో


రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) :తొలినుంచీ తెలుగుదేశం పార్టీని వీడకుండా అనేక ఇబ్బందులు, దాడులు, కేసులు భరిస్తూ వచ్చిన రామకృష్ణ చివరకు వైసీపీ కార్యకర్త చేతిలో హతమారిపోవాల్సి వచ్చింది. పుంగనూరు నియోజకవర్గంలో చాలా మంది ముఖ్య నాయకులు టీడీపీని వీడినా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన కాగతి రెడ్డెప్ప కుమారుడు రామకృష్ణ(55) కుటుంబం మాత్రం పార్టీ పట్ల అంకితభావంతో కొనసాగింది. కృష్ణాపురంలో వైసీపీ కార్యకర్తగా పెద్దిరెడ్డి వెంట ఉన్న కె.శ్రీరాములు కుమారుడు కాగతి వెంకటరమణ(45) గ్రామంలో టీడీపీని లేకుండా చేయాలని రామకృష్ణ కుటుంబంతో తరచూ గొడవకు దిగుతుండడంతో వీరి మధ్య రాజకీయ కక్షలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ప్రభుత్వ భూములను వైసీపీ పాలనలో ఆక్రమించి వ్యవసాయ పొలాలుగా మార్చినట్లు అధికారులకు, టీడీపీ నాయకులకు రామకృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో రామకృష్ణపై వెంకటరమణ కక్ష అధికమైంది.గత నెల 10వ తేదీన రామకృష్ణ పొలానికి మట్టిని తరలిస్తుండగా వెంకటరమణ స్థలంలో టిప్పర్ వెళ్లిందని ఇరువర్గాలు ఘర్షణపడి పుంగనూరు వైద్యశాలలో చేరడంతో సీఐ శ్రీనివాసులు 17వ తేది ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. తర్వాత మళ్లీ రామకృష్ణ, ఆయన కుమారుడు శివ, కోడలు భార్గవిపై వెంకట్రమణ వర్గీయులు దాడి చేశారు. అలాగే 15 రోజుల క్రితం రామకృష్ణ పెద్దకుమారుడు శివపై వెంకటరమణ దాడి చేసి చెయ్యి విరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఫిర్యాదు తీసుకోకుండా రామకృష్ణపై మండిపడి, తమపై దాడులు చేసిన వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కొద్దిసేపటికే విడిచిపెట్టి తమకు అన్యాయం చేస్తున్నట్లు రామకృష్ణ ఒక వీడియో విడుదల చేశారు.

సీఎం ఆరా

రామకృష్ణ హత్యా ఘటనపై శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, అనిత, రాంప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జరిగిన విషయాలను తెలియజేసి ఆస్పత్రిలో బాధితులను పరామర్శించి న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు బాధితులను ఓదార్చాలని హైకమాండ్ ఆదేశించింది.రామకృష్ణ కుటుంబసభ్యులను హోంమంత్రి అనిత ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలిపారు.కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

పల్లె ... శుక్రవారం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఊరేగింపు సందర్భంగా రామకృష్ణ, వెంకటరమణ ఘర్షణ పడుతుండగా సీఐ ఇరువర్గాలనూ మందలించారు. రాజకీయకక్షలు శృతి మించిన నేపథ్యంలో వెంకటరమణ శనివారం ఉదయం పథకం ప్రకారం బోయకొండ రోడ్డులో వేటకొడవలితో రామకృష్ణ కుమారుడు సురేశ్‌పై దాడికి ప్రయత్నించాడు.గమనించిన సురేశ్ చేయి అడ్డుపెట్టడంతో కొడవలి వెనుకవైపు తగిలి గాయాలయ్యాయి.సురేష్ తప్పించుకుని రోడ్డుపై వెళుతున్న ద్విచక్రవాహనంలో ఎక్కి వెళ్లిపోయాడు. అదే సమయానికి రామకృష్ణ ట్రాక్టర్‌తో పొలం దున్ని ఇంటికి రాగా వెంకటరమణ అతడి చేరుకుని రామకృష్ణ కాలు, తొడపై కొడవలితో నరకడంతో రామకృష్ణ రోడ్డుపై పడిపోయాడు. మెడపై నరికి వ్యవసాయ పొలాల్లోకి వెంకటరమణ పరుగులు తీయడాన్ని గ్రామస్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు.గాయపడిన రామకృష్ణను చికిత్స నిమిత్తం మదనపల్లెకు అక్కడినుంచి తిరుపతికి తరలిస్తుండగా మృతి చెందాడు.ఈ విషయం తెలియడంతో గ్రామస్తులు,బంధువులు కృష్ణాపురంలో రోడ్డుపైకి వచ్చి బస్సులు ఆపి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టారని, ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నా వైసీపీ నాయకులు వెంకటరమణ, గణపతి, మహేశ్, త్రిలోకాల నుంచి ప్రాణహాని ఉందని మృతుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే హత్య జరిగిందని మండిపడ్డారు. పోలీసుల నిర్లక్ష్యంపై మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కూడా టీడీపీ శ్రేణులు ఆందోళన చేశాయి.కృష్ణాపురంలో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్‌రెడ్డి ఆందోళనకారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇస్తూ పోలీసు పికెటింగ్ పెట్టారు. మదనపల్లె ఆస్పత్రి వద్ద మృతుడి భార్య దేవమ్మ, కోడలు భార్గవి మాట్లాడుతూ రామకృష్ణను చంపిన వైసీపీ కార్యకర్త వెంకటరమణను చంపితేనే తాము శవం తీసుకెళతామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పుంగనూరు సీఐ సస్పెన్షన్


సీఐ శ్రీనివాసులు

పుంగనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త కె.రామకృష్ణను కిరాతకంగా హత్య చేసిన సంఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని పుంగనూరు సీఐ జి.శ్రీనివాసులును ప్రభుత్వం శనివారం సస్పెండ్ చేసింది. సీఐ శ్రీనివాసులుతో బాటు పుంగనూరు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యాన్ని కూడా సస్పెండ్ చేస్తూ విచారణకు ఆదేశించారు.అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ద్వారా హోంమంత్రి అనిత వివరాలు తెలుసుకుని వారిపై చర్యలకు ఆదేశించారు. టీడీపీ కార్యకర్త రామకృష్ణ 15 రోజుల క్రితం విడుదల చేసిన వీడియా శనివారం వైరల్ అయింది. అందులో పుంగనూరు సీఐ, పోలీసులు తమకు న్యాయం చేయలేదని, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, వైసీపీ వారినుంచి ప్రాణహాని ఉన్నట్లు పేర్కొనడం సంచలనంగా మారింది. దీనికి తోడు మృతుడి కుటుంబ సభ్యుల ఆరోపణలు, ప్రభుత్వ పెద్దల ఆరాతో సీఐతో పాటు హెడ్‌కానిస్టేబుల్‌పై వేటు పడింది.

రాజకీయాలే మా కొంప ముంచాయి!

"మా గ్రామంలో వైసీపీని ఎదిరించి మొదట టీడీపీ జెండా కట్టింది మా నాన్న.. టీడీపీ గెలవడంతో కేక్ కట్ చేస్తుంటే బైక్‌పై వచ్చి మా అమ్మ కాళ్లు విరగ్గొట్టారు.. చంద్రబాబు జన్మదిన వేడుకలు చేస్తుంటే మా అన్న చెయ్యి ఇరగ్గొట్టారు.. ఇప్పుడు ఏకంగా కొడవలితో దాడి చేసి నా చేతికి గాయం చేశారు.. అడ్డు వచ్చిన మానాన్నను కొడవలితో నరికి చంపేశారు.. రాజకీయాలే మాకొంప ముంచాయి దేవుడా" అంటూ రామకృష్ణ కొడుకు సురేష్ రోదించడం చూపరులను కలచివేసింది. ఎన్నికల్లో టీడీపీ గెలిచిందన్న ఆనందంతో టపాసులు కాల్చడమే తమ కుటుంబంపై దాడులు చేయడానికి కారణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వెంకటరమణ కొడవలి దాడిలో తీవ్రంగా గాయపడ్డ రామకృష్ణను, ఆయన కుమారుడు సురేష్‌ను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ డాక్టర్లు సురేష్‌కు మార్‌కు చికిత్స చేశారు. రామకృష్ణను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేయగా కలికిరి సమీపంలో వెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. శవ పంచనామా కోసం మదనపల్లె ఆస్పత్రికి రామకృష్ణ మృతదేహాన్ని తరలించి మార్చురీలో ఉంచారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు వందలాదిమంది ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో రామకృష్ణ మృతదేహాన్ని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, దొరస్వామినాయుడు సందర్శించారు. మృతుడు రామకృష్ణ భార్య ఉమాదేవిని, కుమారులు సురేష్‌కుమార్, శివలను పరామర్శించారు. హోం మంత్రితో బాధిత కుటుంబీకులను ఫోన్లో మాట్లాడించారు. ఆమె వారిని పరామర్శించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుడి భార్య ఉమాదేవి, కుమారుడు సురేష్ మాట్లాడుతూ రాజకీయాలే తమ కొంప ముంచాయన్నారు.తమకు ఎప్పుడూ న్యాయం జరగలేదని ఆవేదన చెందారు.తమపై గతంలో జరిగిన దాడులకు సంబంధించి పుంగనూరు స్టేషన్‌లో కేసులు పెట్టినా, ఏ కేసులో కూడా న్యాయం జరగలేదని వాపోయారు.చివరకు కుటుంబ పెద్దను పోగొట్టుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మా కుటుంబంపై దాడి చేసిన ప్రతి సారీ సర్పంచ్, ఎంపీటీసీలు పుంగనూరు స్టేషన్‌కు చేరుకుని గంటల వ్యవధిలోనే నిందితులను బయటకు తెస్తున్నారని చెప్పారు.

నేడు కృష్ణాపురంలో రామకృష్ణ అంత్యక్రియలు

దారుణ హత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ మృతదేహానికి ఆదివారం ఉదయం 12గంటలకు పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. శనివారం రాత్రి మదనపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి రామకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఇంటికి తరలించారు.


- మదనపల్లె అర్బన్/పుంగనూరు, ఆంధ్రజ్యోతి


రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న శ్రీరాం చినబాబు


రామకృష్ణ కుమారుడు సురేష్

నిండ్ర@ 39.6

- మూడు మండలాల్లో 39డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



చిత్తూరు సెంట్రల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నిండ్రలో శనివారం అత్యధికంగా 39.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడిమి మరింత పెరగడానికి వచ్చే నెల దాకా వేచి చూడాల్సిన పనిలేదని ఈ ఉష్ణోగ్రత చెబుతోంది. జిల్లాలో ఫిబ్రవరి మూడవ వారం నుంచే ఉష్ణోగ్రతలో మార్పు కనిపించింది. ఈనెల మొదటి వారం నుంచి వేసవి ప్రభావం అనుభవంలోకి వచ్చింది. అయినప్పటికీ అత్యధిక ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీల మధ్యే ఉంటోంది. అరుదుగా అక్కడక్కడా 38 డిగ్రీలు దాటి నమోదైంది. అయితే శనివారం తొలిసారిగా మూడు మండలాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు దాటాయి.తవణంపల్లెలో 39.1,గుడిపాలలో 39.2డిగ్రీలు చొప్పున నమోదయ్యాయి.మిగిలిన మండలాల్లో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలివీ.ఎస్‌ఆర్‌పురంలో 38.9, పులిచెర్లలో 38.3డిగ్రీలు,చిత్తూరు రూరల్, నగరి మండలాల్లో 37.6, గుడుపల్లె,శాంతిపురం మండలాల్లో 37.3,రొంపిచెర్లలో 36.5,చౌడేపల్లె,పాలసముద్రం,ఐరాల, వెదురుకుప్పం, విజయపురం మండలాల్లో 36.4,గంగవరం,బంగారుపాళ్యం,పలమనేరు,సదుం మండలాల్లో 36.2, వి.కోటలో36.1, పెనుమూరులో36,జీడీ నెల్లూరు, సోమల మండలాల్లో 35.8, పూతలపట్టులో 35.6, పెద్దపంజాణిలో 35.5, యాదమరిలో 35.3,రామకుప్పంలో 34.6, కుప్పంలో 34.4, బైరెడ్డిపల్లిలో 34.1, కార్వేటినగరంలో 33.8, పుంగనూరులో 33.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణంగా ఏప్రిల్‌లో గానీ ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటదు. అలాంటిది మార్చి 15వ తేదీకే దరిదాపు 40 డిగ్రీలకు చేరువ కావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఈ ఏడాది వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వడగాడ్పుల తీవ్రత సైతం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన సంగతి తెలిసిందే.జిల్లా యంత్రాంగం ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తాజా ఉష్ణోగ్రతలు నొక్కి చెబుతున్నాయి. వేసవి తాపానికి గురికాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ప్రచారం చేయడం వంటివి చేపట్టాల్సి ఉంది.

కాటన్ బ్యాగులనే వాడదాం

- 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ పిలుపు


గాంధీ విగ్రహం వద్ద మానవహారం (ఇన్‌సెట్‌లో) కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీ, ప్రజా ప్రతినిధులు

చిత్తూరు అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులను వాడదామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం కూడలి వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మానవహారం నిర్వహించారు. జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు, ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. ఇందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. రోడ్లపై చెత్తను వేయొద్దని, డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలని సూచించారు. జిల్లా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. రాజమండ్రి, చిత్తూరు, నెల్లూరు క్లస్టర్లలో వ్యర్థాల నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతి పౌరుడూ కృషి చేయాలని విన్నవించారు. మహిళలకు కాటన్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్, ఆర్డీవో శ్రీనివాసులు, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (ఆదివారం సాయంత్రం)
సహార్: 4:59 (సోమవారం ఉదయం)

శేషాచలం స్నేక్స్







కార్తీక్ కెమెరాకు చిక్కిన అరుదైన పాములు

బర్డ్‌మెన్ కార్తీక్

మన దేశంలోని పాముల జాతులు చాలావరకు విషపూరితం కానివే. మానవులకు ఎటువంటి హానీ కలిగించవు. విషపూరిత జాతులు కూడా ఆత్మరక్షణ కోసమే కాటువేస్తాయి. పర్యావరణ వ్యవస్థలో వీటి పాత్ర కీలకమైంది. పాముపల్ల మనిషికన్నా.. మనిషి వల్లే పాముకి ప్రమాదం ఎక్కువ.

కామన్ ట్రింకెట్ : నగరవనంలో కనిపించిన విషరహిత సర్పం

అడవుల్లో పిట్టలను, పుట్టలను ఫొటోలు తీయడం 'బర్డ్‌మన్' కార్తీక్‌కు లెన్స్‌తో పెట్టిన విద్య. కానీ పుట్టలో, చెట్టులో దాక్కున్న పాములను కూడా తన కెమెరాతో బంధించి బర్డ్‌మెన్ కాస్త స్నేక్‌మన్ అయ్యాడు. శేషాచలంలో దాక్కున్న సరీసృపాల వెంట పడ్డాడు. రక్తపింజరి, ఎగిరే పాము, ఇండియన్ కోబ్రా, ఇండియన్ రాక్ పైథాన్, ఇండియన్ స్పెక్టాకిల్ కోబ్రా, రంపపు సాస్కెల్డ్ వైపర్, వెదురు పిట్ వైపర్, బార్డ్ వోల్ఫ్ స్నేక్, కామన్ ట్రింకెట్, వైన్ స్నేక్, బ్రౌన్‌మార్ఫ్, రంపపు స్కేల్డ్ వైపర్, బ్యాండెడ్ క్రైట్ ...ఇలా అనేక రకాల అరుదైన పాములను వెతికి, వెతికి ఫొటోలు తీసి పర్యావరణ ప్రపంచానికి పరిచయం చేశాడు. పాములు సహజంగా చిటారు కొమ్మలు, పగిలిన రాళ్ల సందులు, జలాశయాలు, బొరియలు.. వంటి చోట్ల ఆవాసాలను ఏర్పాటుచేసు కుంటాయి. కొన్ని జాతులు పగటి పూట మాత్రమే బయట తిరుగుతాయి. మరి కొన్ని రాత్రి పూట మాత్రమే సంచరిస్తాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



సాస్కాల్డ్ వైపర్ : (చిన్న పింజరి)- కరకంబాడి అటవీ ప్రాంతంలోని విషపూరిత స్వరం

ఇండియన్ స్పెక్టాకల్ కోబ్రా (నాగుపాము) : తిరుపతి జంగిల్ బుక్‌లో కనిపించిన విషపూరిత సర్పం

నేటి నుంచి తిరుపతి-హుబ్లీ, కాట్పాడి ప్యాసింజర్ల రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి హుబ్లీ, కాట్పాడి మధ్య రాకపోకలు నిర్వహిస్తున్న ప్యాసింజర్లను ఆదివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి-హుబ్లీ మధ్య (57401-57402) ప్యాసింజర్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. తిరుపతి నుంచి హుబ్లీ ప్యాసింజరు ఆదివారం ఉదయం 6.05 గంటలకు బయలుదేరి వెళతుందని చెప్పారు. తిరుపతి-కాట్పాడి మధ్య (67209-67210) మెము రైళ్లరాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. తిరుపతిలో ఈ మెము ప్యాసింజర్ రైలు ఆదివారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీసిటీ సెక్యూరిటీ మేనేజర్‌పై హత్యాయత్నం

● ఐదుగురిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ డిప్యూటీ సెక్యూరిటీ మేనేజరుపై హత్యాయత్నానికి పాల్పడ్డ ఐదుగురిపై శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీసిటీ పరిధిలోని తొండూరు సొసైటీ కాలనీకి చెందిన మునస్వామి రెడ్డి నుంచి సర్వే నెంబరు 18/2లో ఉన్న సుమారు 3.90ఎకరాల మాగాని భూమిని శ్రీసిటీ వారు కొనుగోలు చేశారు. ఆ భూములకు కంచె ఏర్పాటు చేసే పనులను శుక్రవారం మొదలు పెట్టారు. పనులు జరుగుతున్న సమయంలో సొసైటీ కాలనీకి చెందిన పిళ్లారి రఘుపతి, అతని భార్య లక్ష్మి, బావమరిది తనికులం శీను, అతని భార్య విశాలాక్షి, కుమారుడు దేవేంద్ర ఆ భూములు తమవేననని పనులను అడ్డుకోవాలని శ్రీసిటిలోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించారు. శ్రీసిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఆ భూములను తాము అమ్మలేదని గొడవకు దిగారు. నిబంధనల ప్రకారం 2007లో ఈ భూములను శ్రీసిటీ కొనుగోలు చేసిందని ఇందుకు సంబంధించిన రికార్డులు చూపినా వారు వినిపించుకోలేదు. అక్కడ విధుల్లో ఉన్న శ్రీసిటీ మహిళా భద్రతా సిబ్బందిపై దాడులకు యత్నించారు. ఈ క్రమంలో శ్రీసిటీ డిప్యూటీ సెక్యూరిటీ మేనేజరు కోటేశ్వరరావుపై పెట్రోల్ పోసి తగులపెట్టడానికి యత్నించారు. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ హత్యాయత్నం కేసు నమోదు చేసి, రఘుపతి, శీను, దేవేంద్రను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ శ్రీసిటీలో ప్రశాంతతే ముఖ్యమని, భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేటి నుంచి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫారెస్టు సర్వీస్(స్క్రీనింగ్ టెస్టు), ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఆదివారం నుంచి రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఆర్వో దేవేంద్రరెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలను తిరుపతి జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్, పుత్తూరులోని వెంకట పెరుమాల్ కళాశాల, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1,634 మంది హాజరుకానున్నారని, దీనికి తగినట్లు కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.2.88 కోట్లు, శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,987 తలనీలాలు సమర్పించినవారు: 26,880.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు







శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు



చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కళ్యాణోత్సవం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు



కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు

భవిష్యత్తు సోలార్ విద్యుత్తుదే : ఎస్ఈ

చిత్తూరు రూరల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు సోలార్ విద్యుత్తుదే నని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శనివారం గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని చెప్పారు. వేసవి మొదలైందని.. విద్యుత్ వాడకం క్రమంగా పెరుగుతోందన్నారు. ఓవర్ లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఏఈలు అప్రమత్తంగా ఉండి విద్యుత్ అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వర్క్ ఆర్డర్లు పెండింగ్ ఉన్నవారు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని, లేకుంటే సంబంధిత అధికారుల జీతాల జరిమానా కింద రికవరీ ఉంటుందని హెచ్చరించారు. డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రతి విద్యుత్ బిల్లులో క్యూఆర్ కోడ్ ముద్రించడం జరిగిందన్నారు. సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి.. బిల్లును చిటికెలో చెల్లించవచ్చని అన్నారు. ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్, ప్రసాద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై మానసిక ఒత్తిడిని దూరం చేద్దాం

చిత్తూరు సెంట్రల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల్లో పరీక్షలపై మానసిక ఒత్తిడిని దూరం చేసేలా వారికి అవగాహన కల్పించాలని సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ సూచించారు. జిల్లాలో ప్రభుత్వం నియమించిన ఏడుగురు కెరియర్, మెంటర్ హెల్త్ కౌన్సెలర్లతో శనివారం డీఈవో సమావేశ మందిరంలో కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఏఎన్ఎం, పీఈటీలకు శనివారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ.. విద్యార్థినుల్లో భయాలను, ఒత్తిళ్లను దూరం చేయడంతో పాటు వ్యక్తిగత సమస్యలతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. జీసీడీవో ఇంద్రాణి పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నివారిద్దాం

● ఎంసీహెచ్ నోడల్ అధికారి అనిల్

చిత్తూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు నివారిద్దామని స్టేట్ ఎంసీహెచ్ నోడల్ అధికారి డాక్టర్ అనిల్ పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అమలవుతున్న వివిధ జాతీయ కార్యక్రమాలపై సమీక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు గర్భిణులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. అప్పుడే మరణాలు ఉండవని చెప్పారు. ఒకవేళ మరణాలు సంభవిస్తే ఆ బాధ్యత వైద్యాధికారులదే అన్నారు. డీఎంహెచ్‌వో సుధారాణి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులివ్వాలని డీఎంహెచ్‌వోకు ఆదేశం

చిత్తూరు నగరంలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులను అనిల్ శనివారం రాత్రి తనిఖీ చేశారు. స్కానింగ్ గదులను, రికార్డులను పరిశీలించారు. స్కానింగ్‌కు సంబంధించిన వివరాలు సక్రమంగా నిర్వర్తించలేదని షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఎంహెచ్‌వో సుధారాణిని ఆదేశించారు. తీరు మారకుంటే సీజ్ చేయాలని చెప్పారు. అలాగే స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సక్రమంగా తనిఖీలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడిషనల్ డీఎంహెచ్‌వోతోపాటు డెమో జయరాముడు తదితరులున్నారు.

ఐవీఆర్ఎస్‌కు స్పందించని 19మందికి నోటీసులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఇంర్యాక్టివ్ వాయిస్ రిస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్)లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సరిగ్గా స్పందించని 19 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో సమావేశ మందిరంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని పలు సమస్యలపై 2160 కాల్స్ వచ్చాయన్నారు. వీటిని రికార్డు చేసినట్లు తెలిపారు. వీటిలో కేవలం 786 కాల్స్ మాత్రమే క్షేత్ర స్థాయి సిబ్బంది సమాధానం ఇచ్చారని, మిగిలిన వాటిని పట్టించుకోలేదని చెప్పారు. ఐవీఆర్ఎస్ కింద ఫిర్యాదు చేసిన పలువురికి సెకండ్ స్పెల్ కింద కలెక్టరేట్ నుంచి ఫోన్ చేశామన్నారు. దీనిపై బాధితుల నుంచి వచ్చిన వివరణను రికార్డు చేసి, స్పందించని 15 మంది వీఆర్వోలకు, నలుగురు సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు వివరించారు. ఇదిలా ఉండగా బాధితుల సమస్యలపై క్షేత్రస్థాయికి వెళ్లి కూడా సరైన సమాధానం ఇవ్వని పలువురు సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి ఆయా తహసీల్దార్లకు వివరాలు పంపినట్లు తెలిపారు.

మండల స్థాయిలో పీజీఆర్ఎస్ బలోపేతం

మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు డీఆర్వో తెలిపారు. క్షేత్ర, మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు సైతం జిల్లా అధికారుల దృష్టికి రావడం విచారకరమన్నారు. దీనివల్ల క్షేత్ర స్థాయి యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం పోయినట్లు తెలుస్తోందని చెప్పారు. ఏ స్థాయి సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యేలా కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

కాణిపాకంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం

వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్



భక్తులకు జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. శనివారం ఆలయ పరిసరాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అతిథి గృహం నుంచి డార్మెటరీ వరకు రోడ్లను శుభ్రం చేశారు. తోపుడుబండ్లు, దుకాణాల వారితో మాట్లాడి ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తున్నట్లు తెలియజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర జూట్ బ్యాగులు అందించారు. అలాగే కాణిపాకం పంచాయతీ పరిధిలోనూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్‌బాబు, జేసీ విద్యాధరి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్..

మహిళలకు రక్షణ కవచం



శక్తి బృందంలోని సభ్యులు


చిత్తూరు అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళలపై జరిగే అత్యాచారాలు, వేధింపులు, ఇతర హింసాత్మక ఘటనలను నిలువరించడానికి ఈ యాప్ ఉపయోగపడనుంది.

ఆపదలో ఉన్నప్పుడు..

మహిళలు, బాలికలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే చాలు. వారున్న ప్రాంతానికి సమీపంలోని పోలీసుస్టేషన్‌కు, డయల్ 112కు సమాచారం వెళుతుంది. పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలుస్తారు. అంతేకాకుండా ఈ యాప్ ద్వారా నైట్‌షెల్టర్ల వివరాలు, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులు, వన్‌స్టాప్ సెంటర్లు తెలుసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనలపై పూర్తి వివరాలు ఉంటాయి.

యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాక..

ఆండ్రాయిడ్ మొబైల్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలి. మొబైల్‌కు వచ్చే ఓటీపీతో ఫోన్ నెంబరును అనుసంధానం చేయాలి. ఆపదలో ఉన్నప్పుడు వెంటనే స్పందించే బంధువులు, కుటుంబసభ్యుల ఫోన్‌నెంబర్లనూ యాడ్ చేసుకోవాలి.



మహిళలపై వేధింపులను అరికట్టడానికే

మహిళలపై వేధింపులను అరికట్టడానికి శక్తి బృందం పనిచేస్తుంది. ఈ బృందంలోని సభ్యులు మఫ్టీలో విధులు నిర్వహిస్తారు. జిల్లాలో ఎక్కడైనా మహిళలు, బాలికలకు అన్యాయం జరిగినట్లు తెలిస్తే కఠినంగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తాం.

- ఏఎస్పీ రాజశేఖర్ రాజు

ఆరు శక్తి బృందాల ఏర్పాటు

జిల్లాలో ఆరు శక్తి బృందాలను ఏర్పాటు చేస్తూ అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరులో మూడు, నగరిలో ఒకటి, కుప్పంలో ఒకటి, పలమనేరులో ఒకటి చొప్పున ఈ బృందాలు పనిచేస్తాయి. ఈ బృందంలో ఎస్ఐ లేదా ఏఎస్ఐ నేతృత్వంలో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లు ఉంటారు. వీరంతా మఫ్టీలో విధులు నిర్వహిస్తారు. ఆపత్కాలంలో శక్తి యాప్‌కు వచ్చే కాల్స్, లోకేషన్ల ఆధారంగా సంఘటన స్థలానికి చేరుకుని సాయం చేస్తారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా

ఎమ్మెల్యే థామస్



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే థామస్

పెనుమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటానని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. తమ పంచాయతీని పెనుమూరులో విలీనం చేయడంతో ఉపాధి పథకంలో తమ గ్రామాల పేర్లు కనిపించక ఏ అభివృద్ధి పనీ జరగడం లేదని చార్వగానిపల్లె పంచాయతీ ప్రజలు మొరపెట్టుకున్నారు. తమ పట్టా భూమిలో అక్రమంగా వేరొకరు దారిని ఏర్పాటు చేశారని విచారించి న్యాయం చేయాలని చింతపెంట పంచాయతీ రామాపురానికి చెందిన లక్ష్మమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. సామిరెడ్డిపల్లె పంచాయతీ రెవెన్యూలో డీకేటీ పట్టాలు బయటివాళ్లకు ఇవ్వొద్దని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారుకు ఎమ్మెల్యే సూచించారు. మొత్తం 176 అర్జీలు వచ్చాయి. శాఖలవారీగా.. రెవెన్యూకు 89, పంచాయతీ రాజ్‌కు 45, ఇరిగేషన్‌కు 4, ఆర్‌డబ్ల్యూఎస్‌కు 4 అర్జీలు చొప్పున వచ్చాయి. జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, పీఆర్ డీఈ ఆనంద్‌రెడ్డి, విద్యుత్ ఈఈ సురేష్‌బాబు, ఏపీడీ సుబ్రహ్మణ్యం, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, మనోహర్‌రెడ్డి, ఈశ్వర్ ప్రసాద్, తలారిరెడ్డెప్ప, కృష్ణమూర్తినాయుడు, భాస్కర్, చిరంజీవిరెడ్డి, బీజేపీ వాసుదేవనాయుడు, కిషోర్‌నాయుడు, సురేష్‌నాయుడు, ఎన్ఎస్ నాయుడు, యువరాజులునాయుడు, అశోక్, ఏకాంబరం పాల్గొన్నారు.

పగలు టీడీపీ.. రాత్రి వైసీపీతో వెళ్లేవారా

నా గురించి మాట్లాడేది

తమ పార్టీలోనే ఉంటూ కొందరు తనకు చెడ్డ పేరు తీసుకొస్తున్నారని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే థామస్ హెచ్చరించారు. ప్రజా వేదికకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై దుష్ప్రచారం చేసేవాళ్లు జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఒక్క అవినీతి నిరూపించి.. తర్వాత మాట్లాడాలని సూచించారు. తిరుపతిలో కూర్చొని కొందరు 90ఎంఎల్ బ్యాచ్ తనపై తప్పుడు వార్తలు రాస్తున్నారని చెప్పారు. వాళ్లు పగలు టీడీపీ అంటారు.. రాత్రి వైసీపీతో పోతారు.. అలాంటి వారిని వదిలిపెట్టను అన్నారు. పార్టీ అభివృద్ధికి ఇతర పార్టీ నాయకులను కలుపుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. పక్క నియోజకవర్గాల్లో ఏకంగా మేయర్లు, కార్పొరేటర్లనే తీసుకుంటున్నారు.. జీడీనెల్లూరులోనే పార్టీలో చేర్చుకోవడంలేదని తెలిపారు. మరికొందరు ఫోన్‌పేల ద్వారా డబ్బులు వసూలు చేసే వాళ్లు కూడా పార్టీకి చెడ్డ పేరు తీసుకురావాలని చూస్తున్నారని.. వారందరినీ ఎక్కడ పెట్టాలో తనకు తెలుసునని చెప్పుకొచ్చారు.

మద్యం అక్రమ తయారీపై ప్రత్యేక దృష్టి

● ఫిర్యాదులకు 1972 లేదా 94409 00005

● ఎస్పీ మణికంఠ



మత్తు పదార్థాల పరీక్షల వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం అక్రమ తయారీ, దందాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ మణికంఠ చెప్పారు. శనివారం చిత్తూరులోని జిల్లా ఎక్సైజ్ ల్యాబ్, జిల్లా డీఅడిక్షన్ కేంద్రాలను సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న రసాయన పరీక్షలు, మాదక ద్రవ్యాల విశ్లేషణ విధానాలను పరిశీలించారు. మత్తు పదార్థాల నమూనాలను ఎలా పరీక్షిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మద్యం దందా నిర్మూలనకు పోలీసు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా పనిచేయాలన్నారు. అత్యాధునిక సాంకేతికతను వినియోగించి నిఘా పెంచాలని చెప్పారు. యువతను మత్తు పదార్థాలవైపు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. మత్తు పదార్థాలపై సమాచారం అందించాలంటే 1972కు లేదా పోలీస్ వాట్సాప్ నెంబరు 94409 00005కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. వన్‌టౌన్, టు టౌన్ సీఐలు జయరామయ్య, నెట్టికంఠయ్య, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి

వినియోగదారులకు డీఆర్వో సూచన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు సెంట్రల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులకు డీఆర్వో మోహన్ కుమార్ సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీవీకేఎన్ కళాశాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. వస్తువుల నాణ్యత, పరిమాణం, ఉత్పత్తి, వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. తేడాలుంటే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం బాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, వినియోగదారుల ఫోరం అధ్యక్షురాలు అనిత, ఫుడ్ సేఫ్టీ అధికారి నరేంద్ర, లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సీ దుకాణాల సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర, తిరుపతి సెట్విన్, జిల్లా వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మోహన్‌రెడ్డి, ఎన్‌వైకే కోఆర్డినేటర్ ప్రదీప్, మహిళా పీఎస్ డీఎస్పీ విజయశేఖర్ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 50 సెంటర్లలో ఈనెల ఒకటిన ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఇంటర్ సెకండియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 13,166 మంది విద్యార్థులకు 12,569 మంది హాజరవగా, 594 మంది గైర్హాజరైనట్లు డీవైఈవో సయ్యద్ మౌల తెలిపారు. జనరల్ ఇంటర్‌లో 11,695 మందికి 11,474 మంది హాజరవగా, 488 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1201 మందికి 1095 మంది హాజరవగా, 106 మంది గైర్హాజయ్యారు.

రేపటినుంచి స్పాట్ వ్యాల్యుయేషన్

సోమవారం నుంచి చిత్తూరు పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ స్పాట్ వ్యాల్యుయేషన్ జరగనుందని డీవైఈవో తెలిపా రు. అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈనెల 31వతేదీవరకు కొనసాగే ఈ ప్రక్రియకు చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్.. మొత్తం 500 మంది సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు.

రేపట్నుంచి టెన్త్ పరీక్షలు

● పరీక్ష ప్రారంభమైన అరగంట వరకు విద్యార్థులను అనుమతిస్తాం

● 11 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు : డీఆర్వో, డీఈవో



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్, డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్వో మోహన్‌కుమార్, డీఈవో వరలక్ష్మి తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచనలతో శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో సమావేశ మందిరంలో మీడియాకు వివరాలు తెలిపారు. 'సోమవారం నుంచి ఏప్రిల్ ఒకటో తేదీవరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలతోపాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు సైతం నిర్వహించనున్నాం. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రోజూ ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభమైన అరగంట వరకు విద్యార్థులకు కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. జిల్లాలో 21,248 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలురు 11,005 మంది, బాలికలు 10243 మంది ఉన్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 118 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో ఏ కేటగిరీ సెంటర్లు 38, బీ కేటగిరీలో 37, సీ కేటగిరీలో 43 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 11 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షల నిర్వహణలో భాగంగా 118 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 118 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1197 మంది ఇన్విజిలేటర్లు, 37 మంది స్టోరేజ్ కస్టోడియన్ అధికారులు నియమించాం. ఇప్పటివరకు 40 సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశాం. వీరిలో విద్య, పోలీసు శాఖలతోపాటు రెవెన్యూ సంబంధించి డీటీలు, వీఆర్వోలు ఉన్నారు. 8 ఫ్లైయింగ్ స్క్వాడ్లు ఉన్నాయి. వీటిలో విద్య, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు ఉంటారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ బదులు భారత న్యాయ సహిత నియమావళి వర్తిస్తుంది. పరీక్ష కేంద్రాల వద్ద జెరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకుంటాం. చీఫ్ సూపరింటెండెంట్లు మినహా పరీక్ష కేంద్రాల్లో ఎవ్వరూ సెల్‌ఫోన్లు వాడరాదు. పరీక్షలకు సంబంధించి సమస్యలు, సాయం కోసం 90321 85001 హెల్ప్‌లైను నెంబరును 24/7 అందుబాటులో ఉంచాం. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి 1165 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 20 కేంద్రాలు, ఏడు స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశాం. హాల్ టికెట్ చూపితే ఉచితంగా బస్సుల్లో అనుమతించేలా ఆర్టీసీ వారికి సూచనలు చేశాం' అని డీఆర్వో, డీఈవో వివరించారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్, ఏడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా పరిశీలకులుగా జ్యోతికుమారి

టెన్త్ పరీక్షలకు జిల్లా పరిశీలకులుగా వైజాగ్ డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారిని విద్యాశాఖ నియమించింది. ఈమె శనివారం జిల్లాకు చేరుకున్నారు. పరీక్షల సిబ్బంది నియామకం, కస్టోడియన్స్, స్టోరేజ్, పరీక్ష కేంద్రాల్లోని ఏర్పాట్లు ఆదివారం ఆమె పరిశీలించనున్నారు.

మామిడిలో పూత నిలిచేనా..!



- నల్లమచ్చ తెగుళ్లతో రాలిపోతున్న వైనం
- ఎండల తీవ్రతే కారణమంటున్న ఉద్యాన అధికారులు
- పెరుగుతున్న మందుల పిచికారీ వ్యయం
- దిగుబడులపై ఆందోళనలో రైతులు

సోమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మామిడి పంటనే నమ్ముకున్న వేలాది మంది రైతులు ఈ ఏడాది చేదు ఫలితాలే దిగుబడిగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న పంటను కాపాడుకోవడానికి పలు మార్లు మందుల పిచికారీ చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. డిసెంబరు, జనవరి నెలల్లో జాడలేని పూత ఆలస్యంగా ఫిబ్రవరి నుంచే చెట్లలో ఘనంగా వచ్చింది. అయితే ఇప్పుడేమో పూత నల్లగామారి రాలిపోవడంతో రైతుల్లో నిరుత్సాహం చోటు చేసుకొంది. ఉన్న చిన్న పిందెలు పెరగకుండా రాలిపోయి పంట నష్టం జరుగుతోంది. వీటి నివారణకు గత పది రోజులుగా మందుల పిచికారీ చర్యలు చేపట్టి వేలకు వేలు వ్యయం చేస్తున్నారు. ఈ ఏడాది తోతాపురి రకం 50 శాతం దిగుబడి ఉంది. బేనిషా రకం 25 శాతం మాత్రమే దిగుబడి రానుంది. మల్లిక రకం 50 శాతం, ఖాదర్ రకం తదితర పంటలు నామ మాత్రంగానే ఉన్నాయి. ఉన్నపంటను కాపాడుకోవడాని ఇప్పటికే మూడు దశల్లో మందులు పిచికారీ చేయడం జరిగింది. దిగుబడి తక్కువగా ఉండి మందులు చెట్టుకంతా పిచికారీ చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సోమల మండలంలో 9 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఎకరా తోటకు 2 నుంచి 4 వేల లీటర్ల నీటితో మందులు పిచికారీ చేయాల్సి ఉంది. తొలిదశ పూత వచ్చేందుకు మందులకు, మందుల పిచికారీ ట్యాంకరు, కూలీలకు రూ.10 వేలు వ్యయం చేస్తున్నారు. రెండో దశలో పూత వచ్చి పిందెలు నిలిచేందుకు, మూడో దశ పిందెలకు దోమ, తామర పురుగులు ఆశించకుండా, మార్చి నెలలో వేసవి ఎండల నుంచి కూలింగ్ కోసం మరో దశలో మందులు పిచికారీ చేస్తున్నారు. ఇలా ఏడాదిలో 6, 7 సార్లు వివిధ దశల్లో మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఉద్యాధికారులు స్పందించి పిచికారీ మందులు సబ్సిడీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు.





మామిడి తోటల వైపు రాని వ్యాపారులు

ఏటా మామిడి తోటలను లీజుకు తీసుకునే వ్యాపారులు ఇప్పుడు ఎక్కడా కనబడటంలేదు. పొలాల వద్దకు రావడంలేదు. ఈఏడాది ధరలు ఆశాజనకంగా ఉండవనే అంచనాలతో వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. ఈక్రమంలో రైతులే తమ తోటల్లో మందుల పిచికారీ చర్యలు చేపడుతున్నారు.

మందుల వ్యయం భరించలేకున్నాం



ఈ ఏడాదీ మామిడి పంట దిగుబడి ఆశించినంత లేదు. నాకున్న 8 ఎకరాల తోటకు పూత వచ్చేందుకు రూ.20 వేలు ఖర్చు చేశా. మళ్లీ వచ్చిన పూత రాలిపోకుండా ఉండేందుకు రూ. 15 వేలు ఖర్చు. ఇలా కాయలు కోత వరకు 7, 8 సార్లు మందులు పిచికారీ చేస్తున్నాం. మందుల ధరలు బాగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం. సొంతంగానే మందులు స్ప్రే చేసుకున్నాం. ఉద్యాన అధికారులు స్పందించి రాయితీతో మందులు అందజేయాలి. సోమలలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ ఏడాదైనా వ్యాపారలావాదేవీలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వ్యాపారులకు గదులు కేటాయించి ఇక్కడే మామిడి పంట ఇతర రైతుల పంటలు కొనుగోలు చేయాలి.

\- కామిశెట్టి వెంకటా చలపతి, సోమల

నీలం రకం పంటకు అధిక మందుల పిచికారీ తప్పనిసరి



తోతాపురి రకం 50 శాతం పిందె వచ్చింది. బేనిషా రకం, మిగిలిన రకాలు అంతంత మాత్రమే ఉన్నాయి. నాకున్న 10 ఎకరాల మామిడి తోటలో ఫిబ్రవరి నెలలో వచ్చిన పూత నిలుపుకునేందుకు రెండు సార్లు మందులు పిచికారీ చేశాను. కానీ వర్షాలు లేకపోవడంతో వచ్చిన పూత మగ్గిపోతోంది. ఇప్పటికే మూడు సార్లు మందుల కోసం రూ. 50 వేలకు మించి ఖర్చు చేశా. నీలం రకం పంట సీజన్ చివర కోతలు చేస్తాం ఈపంటను కాపాడుకోవడానికి 7 సార్లు మందులు పిచికారీ చేస్తాం. ఖర్చు ఎక్కువ ధరలు ఎలా ఉంటాయో తెలియదు. పంటలు కోతలు చేసి మార్కెట్‌కు పోతే ధరల నిర్ణయం వ్యాపారస్తులదే.

\- వినోద్ కుమార్, పెద్దఉప్పరపల్లె

తేనెమంచు పురుగుతో పూత పూర్తిగా మాడిపోతుంది



తేనె మంచు పురుగు పూత రసాన్ని పీల్చడంతో పూత పూర్తిగా మాడిపోయి పిందె పట్టదు. లేత ఆకులు, కొమ్మల నుంచి రసం పీల్చుతాయి. పురుగులు విసర్జించిన తేనెలాంటి బంక ఆకులపై కారి సూర్యరశ్మి వెలుతురులో మెరుస్తుంది. లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2 మి.లీ కలిపి పిందెలు తయారయ్యే సమయంలో పూత ఆకులపైనే కాకుండా కొమ్మలపైనా పిచికారీ చేయాలి.

\- సంతోషి కుమారి,
ఉద్యానశాఖ అధికారిణి, చౌడేపల్లె

అడవీ మడుగూ బాగుపడ్డాయి!



కుప్పం దిబ్బరేవులు ప్రాంతంలోని చెత్తాచెదారం తొలగిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

కుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంతో ఊరూవాడలే కాదు.. అడవీ మడుగూ సైతం బాగు పడుతున్నాయి. చెత్తాచెదారం తొలగి శుభ్రపడుతున్నాయి. ప్రభుత్వం శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కుప్పం అటవీ శాఖ పరిధిలోని కంగుంది అటవీ క్షేత్రంలోని దిబ్బరేవులు ప్రాంతాన్ని అటవీ శాఖ సిబ్బంది, అధికారులు కలిసి శుభ్రం చేశారు. అటవీ ప్రాంతంతోపాటు, నీటి మడుగులో పడివున్న ప్లాస్టిక్ కవర్లు, మందు బాటిళ్లు, ఇతరత్రా చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి ఆర్.జయశంకర్, సిబ్బంది, నాయనూరు వన సంరక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా సమస్యా.. కాల్ 9849901049



తాగునీటి సరఫరాపై స్థానికులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో ఏ ప్రాంతంలో తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్య తలెత్తినా నేరుగా 9849901049 నెంబర్‌కు కాల్ చేసి తనకు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు సూచించారు. కుప్పం మున్సిపాలిటీ మోడల్ కాలనీ ఏర్పడిన తాగునీటి సరఫరా సమస్యను శనివారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిష్కరించారు. ఆదివారం లక్ష్మీ లేఅవుట్, ఇందిరమ్మ కాలనీలలో తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తనకు కాల్ చేసిన ఒకట్రెండు రోజుల్లోగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు.

సంగం పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభం



సంగం డెయిరీ ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిధి బందార్లపల్లెలో సంగం డెయిరీ శీతలీకరణ కేంద్రాన్ని డెయిరీ రాయలసీమ మేనేజర్ వెంకటేశ్వర్లుతో కలిసి టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి శనివారం ప్రారంభించారు. అన్ని ప్రైవేటు డెయిరీలకు ధీటుగా సంగం డెయిరీ పాడి రైతులకు సేవలందిస్తోందని తెలిపారు. పాడిరైతులు సంగం డెయిరీకి పాలు పోసి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజర్లు రవిఅమ్మినేని, శ్రవణ్‌కుమార్, వి.కోట ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత మోహన్‌రావు, టీడీపీ నేతలు పెరుమాళ్, ఆనందరెడ్డి, శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, నియాజ్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ



విద్యా సామగ్రిని అందిస్తున్న శాంతిపురం లయన్స్‌క్లబ్ సిబ్బంది

శాంతిపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమాపురం, శివరామపురం ఉన్నత, శాంతిపురం ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శాంతిపురం లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని వితరణ చేశారు. శాంతిపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందిగం ఉదయకుమార్ నాయుడు సభ్యులతో కలిసి శివరామపురం, సోమాపురం, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు పునాదిలాంటివన్నారు. ఈ పరీక్షలను భయపడకుండా ధైర్యంగా రాయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లత, లైన్స్ క్లబ్ సభ్యులు మురళీ, బాబు, చంద్రశేఖర్, మధు, సింగిరి శ్రీనివాసులు, రవి శివరామాపురం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు రాణించాలి



నమూనాలను పరిశీలిస్తున్న కళాశాల చైర్మన్ రవీంద్రబాబు

గంగవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెక్నాలజీకి అనుగుణంగా రాణించి ఆధునిక సాంకేతికతను పెంపొందించుకోవాలని మదర్ థెరీసా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం.. మహిళ అరెస్టు



అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

రామకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం రామకుప్పం మండలంలో ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. దాడుల్లో పీఎం కేతాండా గ్రామ సమీప అడవిలో ఉప్పెన్నచెరువు వద్ద సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కుప్పిగానిపల్లె ఓ ఇంటిపై దాడి చేసి విక్రయానికి సిద్ధంగా ఉన్న సారాను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న సరోజమ్మ(59)ను అరెస్టు చేశారు. సరోజమ్మకు నాటుసారా సరఫరా చేస్తున్న కొర్నాలకొండతాండాకు చెందిన కుమార్‌నాయక్‌పై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ నాగరాజు, ఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, వెంకటేశ్, చక్రినాయక్, పన్నీర్‌నాయక్, కళ్యాణ్‌కుమార్, రాజేష్, పద్మావతి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రితో విద్యార్థులు

రామకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కెంపసముద్రం, శాంతిపురం మండలం దండికుప్పంలలోని జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నలంద విద్యా సంస్థ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి వితరణగా అందించారు. శనివారం ఆయా పాఠశాల్లో జరిగిన కార్యక్రమాల్లో నలంద కళాశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వినయ్‌రెడ్డి విద్యార్థులకు అందించారు. పదో తరగతిలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నలంద కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యం



కుప్పంలోని ఉర్దూ స్కూల్ విద్యార్థులకు కాటన్ బ్యాగులను పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు



పలమనేరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి

కుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన పరిసరాలు, స్వచ్ఛ మనసులు కలిగి ఉంటేనే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ఎం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాఠశాల ఆవరణలోని చెత్తాచెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వచ్ఛ కుప్పం కల సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. మున్సిపాలిటీ తరఫున ఇప్పటికే ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్న విషయం గుర్తు చేశారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకం త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధానికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు కాటన్ బ్యాగులు పంపిణీ చేసి ప్లాస్టిక్ వాడకంతో నష్టాలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోము, టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, డాక్టర్ వెంకటేశ్, కన్నన్, ఆర్‌ఆర్. రవి పాల్గొన్నారు.

- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి సిబ్బందితో కలిసి స్థానిక వారపు కూరగాయల సంతలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ సిబ్బంది కోసం వైద్యఆరోగ్యశాఖ చే ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలమనేరు మార్కెట్ యార్డులో పారిశుధ్య చర్యలు చేపట్టారు. మార్కెట్ సెక్రటరీ సంజీవకుమార్, సిబ్బంది, ఏవో సంధ్య పాల్గొన్నారు.
- సోమల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ కోరారు. శనివారం సోమల బస్టాండులో మానవహారం ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞ చేయించారు. డీటీ ఇబ్రహీం, ఎంఈవో శివరత్న, జేఈ అనూష, హెచ్ఎంలు హరినాథ్, ఎల్లయ్య, పీడీ కరుణానిధి, కార్యదర్శి జయశంకర్, నాయకులు మదన్‌మోహన్‌బాబు, టీడీపీ శివశంకర్, మహేంద్రబాబు, చాణుక్య పాల్గొన్నారు.
- శాంతిపురం: శాంతిపురం బస్టాండ్ సర్కిల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్మికులతో కలిసి వీధులు శుభ్రపరిచారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు కలిసి మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, ఎంపీడీవో కుమార్, ఈవోపీఆర్డీ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి అశ్వత్‌నారాయణ, సర్పంచ్ జయరాం, టీడీపీ నేతలు రాజారెడ్డి, కేద్రనాథ్, నారాయణ, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురం మండలం దండికుప్పంలో...



సోమలలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బెన్నురాజ్ తదితరులు

రొంపిచెర్ల: పరిసరాలలో ప్లాసిక్ వ్యర్థాలను నివారించడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రామిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ దినేష్‌కుమార్‌నాయక్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి పరిసరాలలో చెత్త సేకరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, హెచ్ఈ రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా గుర్తించాలని బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తీర్థం గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలసి మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ఈవోఆర్డీ ప్రసాద్, మండల కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు సదాశివయ్య, రాజశేఖరాచారి, నాగరాజు, నాయకులు రమేష్, గోవిందస్వామి, శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు విజయానికి మూలం



విద్యార్థులకు ఇంజనీరింగ్ పట్టాలను ప్రదానం చేస్తున్న డీఆర్డీయే శాస్త్రవేత్త విజయకుమార్, బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణ (ఇన్నొవేషన్), స్థిరత (సస్టైనబిలిటీ) విజయానికి మూల సూత్రాలని బెంగళూరు డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ ఢిల్లీబాబు విజయకుమార్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో డిగ్రీ పట్టా పొందడం గొప్ప మైలురాయిగా అభివర్ణించారు. గొప్ప కలలు కని, అందుకోసం పరిశ్రమించాలన్న దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ ఇచ్చిన నినాదాన్ని నిరంతరం విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని, చిన్న ఆలోచనలను సైతం ప్రభంజనాలుగా మార్చే అవకాశం ఇప్పుడు వారి ముందుందన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో విప్లవాత్మక మార్పులకు సమయం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. బీసీఎన్ విద్యా సంస్థల వ్యవవస్థాపక అధ్యక్షులు బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిభావంతులైన అధ్యాపకులచే నాణ్యమైన బోధనా ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నామని చెప్పారు. అనంతరం సుమారు 300 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.బాస్కరన్, విభాగాధిపతులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో అధికారులు ప్రజాసమస్యలపై స్పందించాలని శనివారం జరిగిన మునిపల్ సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారులను కోరారు. శనివారం మున్సిపల్‌చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. గంటావూరు శనీశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న రహదారి ఆక్రమణలకు గురవుతోందన్నారు. పట్టణంలో సేకరించిన చెత్తాచెదారాన్ని సంపదగా మార్చుచేసేందుకు క్యాబ్ సంస్థకు అప్పగించారని.. పనులు ఆపి ఏడాది అవుతోందని కౌన్సిలర్ కోదండరామయ్య వాపోయారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగా చెత్త నుంచి సంపద తయారు చేసే పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణానికి అధికారులు డబ్బులు డిమాండు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వకుంటే అనుమతులు ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నారని కౌన్సిలర్ కిరణ్ ఆరోపించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్.ఓ.రవిరెడ్డి, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌చార్జి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మధురమలై కొండకు నిప్పు

సోమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట చెన్నపట్నం చెరువు సమీపంలోని మధురమలై కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. పశువుల కాపర్లు మేతకు వెళ్లిన పశువులతో తిరిగి గ్రామానికి చేరుకున్నారు. మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించారు. అలాగే అడుసుపల్లె సమీప గుట్టలకు నిప్పు పెట్టడంతో ఆర్పేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. పొలాల వద్దకు మంటలు రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు.

నేడు రామకుప్పంలో ఉచిత కంటి వైద్యశిబిరం

రామకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆసుపత్రి, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాప్రతినిధులంటే అంత అలుసా..?

- మండల సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు



శాంతిపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులను అధికారులు పట్టించుకోవడం లేదని.. సమస్యలపై విన్నవించినా పనులు చేయడం లేదంటూ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. శనివారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ వసుంధర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వెలుగు సీసీ మహిళా సంఘాలకు రుణాలు తీసివ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని గుంజార్లపల్లె సర్పంచ్ విజయరామిరెడ్డి వాపోయారు. ఉపాధి హామీలో యంత్రాలతో పనులు చేసి బిల్లులు స్వాహా చేస్తున్నారని కెనమాకులపల్లె సర్పంచ్ జయరాం ఉపాధి సిబ్బందిని ప్రశ్నించారు. జడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, ఎంపీడీవో కుమార్, తహసీల్దారు శివయ్య, వైస్ ఎంపీపీ సరస్వతి, జడ్పీటీసీ శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి హత్యా రాజకీయాలు దారుణం

- చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు, ఇతర ప్రాంతాల్లో గత ఐదేళ్లలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేసిన పాపాలు కడుక్కోకుండా ఇంకా హత్యా రాజకీయాలు చేయడం దారుణమని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ టీడీపీ జెండా మోస్తూ చంద్రబాబునాయుడు సీఎం కావాలని నిరంతరం స్మరించిన కృష్ణాపురం టీడీపీ కార్యకర్త రామకృష్ణను దారుణంగా వేటకొడవలితో నరికి చంపడం దుర్మార్గమన్నారు. మృతుడి కుటుంబానికి తాను, టీడీపీ అండగా ఉంటామని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ నిందితులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. పుంగనూరులో ఇంకా పెద్దిరెడ్డి రాక్షస పాలన, రౌడీయిజం, హత్యా రాజకీయాలతో జనాలు నరకయాతన పడుతు న్నారని ఆరోపించారు. పుంగనూరు ప్రశాంతత కోసం ఓపికగా ఉంటున్నామన్నారు. వైసీపీ అరాచకాలు మానుకోకపోతే చర్యలు కఠినంగా ఉంటాయని, తప్పు చేసిన వైసీపీ వారిని చట్టం వదలదని తెలిపారు.

లక్ష్మీనరసింహుడికి పట్టువస్త్రాల సమర్పణ



కల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామికి శనివారం రాత్రి పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన చల్లా రామచంద్రారెడ్డికి ఆలయ అర్చకులు, టీడీపీ నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక వాహనంపై ఆశీనులైన స్వామివారు నాలు గుమాడ వీధుల్లో ఊరేగారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి: జడ్పీ సీఈవో


సమావేశంలో ప్రసంగిస్తున్న రవికుమార్‌నాయుడు

పెనుమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. శనివారం పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఫేర్‌వెల్ డేలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే థామస్, అధికారులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి హాజరై, మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్‌ఎం యామిని, పాఠశాల కమిటీ చైర్మన్ ముని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం తొలగించండి
ప్రజాదర్బార్‌కు 41 అర్జీలు


మద్యం దుకాణం తొలగించాలని అర్జీ సమర్పిస్తున్న శివాజీ నగర్ మహిళ

చిత్తూరు సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమ నివాసాల మధ్య మద్యం దుకాణం తొలగించాలని కలెక్టరేట్ సమీపంలోని శివాజీ నగర్ మహిళలు కోరారు. లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఈ మేరకు అర్జీ సమర్పించారు. మద్యం దుకాణం సమీపంలో బాలికల హాస్టల్, జిల్లా ట్రైనింగ్ సెంటర్, బ్యాంక్, వినాయకస్వామి గుడి ఉన్నాయని చెప్పారు. మందు బాబుల వల్ల వీధుల్లో తిరగలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 41 అర్జీలు అందాయి. చిత్తూరు రూరల్, గుడిపాల ఎంపీడీవో శ్రీనివాసులు, శివరాజ్, తహసీల్దార్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

గుడిపాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, అప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతారని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శనివారం కమ్మతిమ్మాపల్లె హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లీడర్‌షిప్ స్కిల్స్ తప్పనిసరి

నగరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో లీడర్‌షిప్ స్కిల్స్ తప్పనిసరి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. లీడర్‌షిప్ అండ్ కొలాబరేషన్ ఒక నెల సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమాన్ని శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల వితరణ


విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న వరుణ్ కుమార్

చిత్తూరు సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పదో తరగతి విద్యార్థులకు జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, తానా ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులు శనివారం వితరణ చేశారు. 25వ డివిజన్‌లో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ కూడా విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు వితరణ చేశారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఈడిగ కులస్తులు ఐక్యంగా ఉండాలి'


గోపీని సన్మానిస్తున్న ఈడిగ సంఘం నాయకులు

బంగారుపాళ్యం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈడిగ కులస్తులు ఐక్యంగా ఉండాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి కృష్ణమూర్తి గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం వజ్రాలపురం బోయకొండ గంగమ్మ సమావేశం మందిరంలో జిల్లా ఈడిగ సాధికారిక కన్వీనర్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈడిగ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొమ్మాయిపల్లెకు చెందిన గోపీని జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌పేట, పుంగనూరుకు కేటాయించిన రెండు దుకాణాలను తమ కులస్తులపేరిట అగ్రకులస్తులు చేజిక్కించుకోవడం తగదన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గీత కార్మిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు మహేంద్ర గౌడ్, నీరజాక్షులు గౌడ్, జిల్లా కార్యదర్శి గోపి, అట్లూరి శ్రీనివాసులు, న్యాయవాది ప్రసాద్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

'వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి'

గంగాధరనెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు హితవు పలికారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్లాస్టిక్‌తో ప్రకృతి వినాశనం

చిత్తూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వినాశనానికి ప్లాస్టిక్ వాడకమే కారణమని పాలూరు మాజీ సర్పంచ్ మోహన్‌రాజ్ అన్నారు. చిత్తూరు రూరల్ మండలంలోని పాలూరు పంచాయతీ పాలంతోపులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామాన్ని శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శులు గిరిజ, కవిత, టీడీపీ నాయకులు వెంకటేష్, గోవిందరాజులు, రవి, కార్మికులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను మళ్లీ వాడొద్దని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. అగరమంగళం, వింజం పంచాయతీల్లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, మాజీ సర్పంచ్ గోవిందయ్య, వింజం ఎంపీటీసీ హనీఫ్‌బాషా, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ బాలచంద్రారెడ్డి, టీడీపీనేత సతీష్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం'పై అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చక్రధర్, భానుప్రకాష్ తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను ప్రజలు వినియోగించొద్దని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి పాలసముద్రం బీసీ కాలనీవరకు ర్యాలీ నిర్వహించారు. ఈవోపీఆర్డీ రమేష్, ఏపీవో మార్గరేట్, కార్యదర్శులు పాల్గొన్నారు.



చీపురు పట్టి చెత్త ఊడుస్తున్న నగరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు భానుప్రకాష్, మురళీమోహన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం
స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేల పిలుపు

నగరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరి మున్సిపాలిటీ మార్కెట్ ప్రదేశం, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే చీపురుపట్టి చెత్త ఊడ్చారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈ సురేంద్రరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీర, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతినాయుడు, శ్రీనివాసన్, శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్, సలీమ్ పాల్గొన్నారు.

పూతలపట్టు: పి.కొత్తకోట పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, స్థానిక నేత బాబురావు, ఎంపీడీవో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, మండల పంచాయితీ విస్తరణ అధికారి లక్ష్మీపతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఏవో వనిత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గాయత్రీ, గ్రామ సచివాలయ ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ● కార్వేటినగరంలో వేణుగోపాలస్వామి ఆలయ పరిసరాల్లో ఆలయ అధికారి సురేష్‌కుమార్, సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

విజయపురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలోనూ..

చిత్తూరు అర్బన్: అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరులో పోలీసు కార్యాలయం, ఏఆర్ కార్యాలయం, పోలీసు స్టేషన్ల పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఏఎస్పీ నందకిశోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ సిబ్బందితో ప్రతిజ్ఞ

చిత్తూరు సెంట్రల్: కలెక్టరేట్‌లోని సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను డీఆర్వో డీఆర్వో మోహన్ కుమార్ చేయించారు. కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు.



రేసు కుక్కల దాడిలో పది మేకల మృతి



వెదురుకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం టీకేఎంపేట గ్రామానికి చెందిన మేకలపై రేసు కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో పది మేకలు మృత్యువాత పడ్డాయి. శనివారం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. టీకేఎంపేటకు చెందిన ఏసునాథ, సుందరమ్మలకు చెందిన మేకలను ఇంటి ఆవరణంలో కట్టేశారు. ఈ మేకలపై శుక్రవారం రాత్రి రేసు కుక్కలు దాడి చేశాయి. ఏసునాథకు చెందిన ఆరు మేకలు, సుందరమ్మకు చెందిన నాలుగు మేకలను చంపేశాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకుపైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం: డీఎస్పీ


కార్వేటినగరం పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న డీఎస్పీ అజీజ్

వెదురుకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పిలుపునిచ్చారు. శనివారం కార్వేటినగరం పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కార్వేటినగరం సమీపంలో ఉన్న టపాసుల గోదామును ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు.

వేసవిలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
ఎంసీహెచ్ నోడల్ అధికారి


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అనిల్

గుడిపాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్టేట్ ఎంసీహెచ్ నోడల్ అధికారి డాక్టర్ అనిల్ ఆదేశించారు. శనివారం గుడిపాల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామీణులకు తెలియజేయాలన్నారు. వైద్యాధికారి సంధ్య, సీహెచ్‌వో బాలసూర్యనారాయణ, సూపర్‌వైజర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

'ఇచ్చిన డబ్బులు అడిగితే.. కేసు పెడతారా?'

గుడిపాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన డబ్బులను అడిగితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతారా? అంటూ జనసేన మండల అధ్యక్షుడు రూప్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నారగల్లు పంచాయతీ కొత్తకోట దళితవాడకు చెందిన జగన్నాథం, ఆయన కుటుంబీకులు తన వద్ద రూ.50వేలు తీసుకున్నారన్నారు. అందులో రూ.30వేలను ఇచ్చారని, మిగిలిన రూ.20వేలను ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఆ డబ్బు అడిగితే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం దారుణమన్నారు.

సంత వేలంతో రూ.4.65 లక్షల ఆదాయం

బంగారుపాళ్యం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తగ్గువారిపల్లె పంచాయతీలో దినసరి, వారపు సంత నిర్వహణకు బహిరంగ వేలం శనివారం పంచాయతీ కార్యాలయంలో జరిగింది. బంగారుపాళ్యంకు చెందిన రమేష్‌బాబు అత్యధికంగా రూ.4,65000తో దక్కించుకున్నారు. ఈ వేలం పాట సర్పంచ్ వాణిప్రియా, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు హేమచంద్రనాయుడు, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

జామెట్రీ బాక్సుల పంపిణీ



చిత్తూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ ఆర్ పేట జడ్పీ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి చంద్రప్రకాష్ ఆదేశాలతో జామెట్రీ బాక్సులు పంపిణీ చేసినట్లు టీడీపీ మండల బీసీ సెల్ నాయకుడు శ్రీనివాసులు తెలిపారు. హెచ్‌ఎం రమేష్‌బాబు, సీనియర్ నాయకులు మనోహర్‌నాయుడు, నాగభూషణం నాయుడు, నయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



గంగాధరనెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ముక్కళత్తూరు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రిని సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వితరణ చేశారు. హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, రిటైర్డ్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాజేష్, టీచర్లు పాల్గొన్నారు.

విజయం బిజినెస్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే



చిత్తూరు సెంట్రల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విజయం బిజినెస్ స్కూల్లో ఎంబీఏ, ఎంసీఏ 2022-24 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గ్రావిటా ఇండియా లిమిటెడ్ ప్రెస్ ప్రెసిడెంట్ ఏవీ శర్మ, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం నాయుడు, బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ జయంత్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణరావుకు, జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్ బాబుకు జ్ఞాపికను అందిస్తున్న ఆలయాధికారులు

ఐరాల(కాణిపాకం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వై.లక్ష్మణరావు, జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్‌బాబు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఎస్పీ రమాదేవి ఉన్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళాలు: వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి చిత్తూరు గిరింపేటకు చెందిన సుభాషిణి రూ.1,00,116, తెనాలికి చెందిన రామచంద్రరావు రూ.1,00,116లను శనివారం విరాళంగా అందించారు.

'మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలి'

చిత్తూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికులపై రాజకీయ వేధింపులు సరికాదని చెప్పారు. నేత నాగరాజు, రాజేశ్వరి, రాణి, శెల్వి, సుశీల, సుమ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు / విద్యార్థులకు ఎంపీ ప్రసాదరావు సూచన




సమావేశానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు - విద్యార్థినుల సందడి

పూతలపట్టు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలు కావొద్దని విద్యార్థులకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచించారు. పి.కొత్తకోట సమీపాన ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవంలో భాగంగా జరుగుతున్న ప్రజ్ఞా 2కే25 కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మూలస్తంభాలన్నారు. ప్రతి విద్యార్థీ తమ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చదువుకోవాలన్నారు. చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ మాట్లాడుతూ.. ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదగవచ్చన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అకడమిక్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపాల్ నవీన్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి: తహసీల్దార్

విజయపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ కిరణ్ ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. సచివాలయం, మీ-సేవ ద్వారా వచ్చే సమస్యలను గడుపు దాటేలోపు పరిష్కరించాలని చెప్పారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

పాలసముద్రం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే వారంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప సూచించారు. శనివారం బలిజకండ్రిగలో వాహనాలు తనిఖీ చేశారు. రికార్డుల్లేని వారికి జరిమానా విధించారు.

వన వేణుగోపాలుడికి పూజలు

వెదురుకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

'స్కిల్ అప్' శిక్షణ కార్యక్రమం

వెదురుకుప్పం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రైతు సేవ కేంద్రంలో 'స్కిల్ అప్' శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. రైతులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, ఏవో హేమలత పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు రిటైర్ టీచరు చంద్రయ్య ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్, జామెట్రీ బాక్సులను వితరణ చేశారు. హెచ్‌ఎం జ్ఞానప్రకాష్ వీటిని విద్యార్థులకు అందజేశారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

పెనుమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎగువపూనేపల్లెకి చెందిన సుబ్రహ్మణ్యం(42) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మధు తెలిపారు. కుటుంబతగాదాలతో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు సుబ్రహ్మణ్యం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత గ్రామ సమీపంలో ఉరేసుకుని మృతి చెందాడు. శనివారం ఉదయం గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైల్లోనుంచి జారిపడి యువకుడి మృతి

చిత్తూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. కొంగారెడ్డిపల్లెలోని సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన హేమకుమార్(31) చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం ప్రయాణిస్తుండగా షుగర్ ఫ్యాక్టరీ వద్ద ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. తీవ్రగాయాలైన అతడిని చూసి అక్కడే ఉన్న రైల్వే సిబ్బంది 108కి సమాచారం ఇచ్చారు. వారొచ్చి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మధురమలై కొండకు నిప్పు

సోమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట చెన్నపట్నం చెరువు సమీపంలోని మధురమలై కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. అలాగే అడుసుపల్లె సమీప గుట్టలకు నిప్పు పెట్టడంతో ఆర్పేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.